# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 30 మార్చి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 253

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




ఎథిక్స్ కమిటీకి కౌశిక్‌రెడ్డి వ్యవహారం

-2లో






# ప్రధాని మౌనం వీడి యుద్ధాన్ని నిలువరించాలి

**యుద్ధ వ్యతిరేక కమిటీ నేతల డిమాండ్ హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన**

హైదరాబాద్,:పెట్టుబడిదారీ వైఫల్యాలతో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై యుద్ధానికి దిగాయని.. దీంతో ఇతర దేశాలపై ఆర్థిక భారం పెరిగిందని యుద్ధ వ్యతిరేక కమిటీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వగురువుగా చెప్పుకొనే ప్రధాని మోదీ.. మౌనాన్ని వీడి యుద్ధాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధాన్ని నిరసిస్తూ ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన సభలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, టీజేఎస్, ఎంబీటీ, ఆప్ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వరకు భారీ ప్రదర్శన సాగింది. అనంతరం అక్కడ ప్రొఫెసర్ కోదండరాం అధ్యక్షతన సభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్.కె.నారాయణ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంపన్న దేశాలపై దాడులు చేసూ హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. సీపీఐ(ఎం) జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు మాట్లాడుతూ.. బ్రిక్స్ సభ్య దేశాలు యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడితే.. అధ్యక్షుడిగా ఉన్న ప్రధాని మోదీ కనీసం ఖండించే సాహసం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ..ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధంతో సామ్రాజ్యవాదం అసలు స్వరూపం ప్రజల ముందు ఆవిష్కృతమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ ఎండీ రియాజ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ అధికార ప్రతినిధి చలపతిరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, సీపీఐ సీనియర్ నాయకుడు సయ్యద్ అజీజ్‌పాషా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జాదుల్లాఖాన్ పాల్గొన్నారు.



పరిశ్రమ యజమానుల్ని బెదిరించి భూముల బదలాయింపు దీనిపై సభాసంఘానికి సిద్ధం: సభలో సీఎం రేవంత్‌రెడ్డి

కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏమైందని భాజపాకు ప్రశ్న

# "సీఐడీ వద్దంటే సీబీఐ"

-2లో

మైనింగ్ అక్రమాలపై ప్రతిపక్షం అడిగితే వేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి

మంత్రి బంధువులను బ్లాక్‌మెయిల్ చేసేందుకే బీఆర్ఎస్ సభ్యుల సభా సంఘం డిమాండ్

సభలో మీ పప్పులు ఉడకవు.. మీ మంత్రాలకు చింతకాయలు రాలవు

దళితులపై బీఆర్ఎస్‌కు నాటి నుంచి చిన్నచూపే

దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ ఆ పదవికి దళితులు తగరని అవమానించారు.. స్పీకర్‌గా దళితుడు ఉన్నందునే ఆయన సభకు రావట్లేదు.. భట్టి బడ్జెట్ పెట్టడమూ నచ్చట్లేదు నాడు 'రావు'లే రాజ్యమేలితే... ఇప్పుడు భట్టి, వివేక్,అడ్లూరి, సీతక్క వంటి వారున్నారు శాసనసభలో బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజంధరణి పోర్టల్‌తో హరీశ్‌రావు బంధువుల భూదోపిడీ





ప్రతీకార దాడులు తప్పవన్న ఐఆర్‌జీసీ తమ గడ్డపై అడుగుపెడితే అమెరికా సైనికులను బుగ్గి చేస్తామన్న ఇరాన్ పార్లమెంటు స్పీకర్

# అమెరికా అవాక్స్ ధ్వంసం

యుద్ధంలో అగ్రరాజ్యానికి గట్టి ఎదురుదెబ్బ

ఇరాన్ దాడిలో పూర్తిగా దెబ్బతిన్న అత్యాధునిక నిఘా విమానం

పాక్‌లో ఈజిప్టు, సౌదీ, తుర్కియే విదేశాంగ మంత్రుల భేటీ

వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య ప్రత్యక్ష చర్చలకు ప్రయత్నాలు

ఇరాన్ విశ్వవిద్యాలయాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

పశ్చిమాసియాలో బలగాల మోహరింపు పెంచుతున్న అమెరికాకు ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ గట్టి హెచ్చరికలు జారీచేశారు. శాంతిచర్చలకు సిద్ధమని బయటకు చెప్తూ.. భూతల దాడులకు సిద్ధమవుతుండటమేంటని ప్రశ్నించారు. అమెరికా సైనికుల రాకకోసం తాము ఎదురుచూస్తున్నామన్నారు.

-2లో





# సీఐడీతో కాదు.. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిద్దాం

మా కుటుంబీకులపై చేసిన ఆరోపణలపై ఎంక్వయిరీకి సిద్ధం

మీ కుటుంబ సభ్యుల స్కామ్‌లపై మీరు రెడీనా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్

"మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమాలు బయటపడగానే.. నాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. నా బావమరిది, నా తమ్ముడి పేర్లు ప్రస్తావిస్తూ మాపై ఆరోపణలు చేశారు. మా కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలపై మేం విచారణకు సిద్ధం. మరి మీ సోదరులు, బావమరిది కుంభకోణాలపై మీరు విచారణకు రెడీనా? హౌస్‌కమిటీ, సీఐడీతో విచారణ కాదు.. హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం. నేను సిద్ధం.. మీరు సిద్ధమా?"

-2లో

# కేటీఆర్‌ను కాపాడుతోంది రేవంత్‌రెడ్డే





హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ల మధ్య ఒప్పందం కుదిరిందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్ అవినీతి కేసుల జోలికి వెళ్లడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'కల్వకుంట్ల కవిత, కేటీఆర్‌ల మధ్య సయోధ్య కుదిర్చేందుకు రేవంత్‌రెడ్డి మధ్యవర్తి పాత్ర పోషిస్తున్నారు. కేవలం హరీశ్‌రావును మాత్రమే లక్ష్యంగా చేసుకొని కాళేశ్వరంలోని కొంతభాగం అవినీతిపైనే మాట్లాడుతున్నారు. కాళేశ్వరంలో జరిగిన మొత్తం రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరిపితే అందరి బండారం బయటపడుతుంది. రేవంత్‌రెడ్డికి హరీశ్‌పై ఉన్నంత పగ కేటీఆర్‌పై లేదు. అందుకే ఈ-ఫార్ములా కేసు, డ్రగ్స్, ఫాంహౌస్ కేసుల నుంచి ఆయనను కాపాడుతున్నారు. భవిష్యత్తులో భారాసతో కలిసి పోటీచేయాలని రేవంత్ భావిస్తున్నారు. భారాస, భాజపాల పొత్తు జరగని పని. కేసీఆర్ కుటుంబ అవినీతిని భూస్థాపితం చేయాలనే ఉద్దేశంతోనే మేము పోరాటాలు చేశాం. ప్రధాని మోదీ కూడా ఇటీవల జరిగిన సమావేశంలో రాజకీయ కుటుంబ వారసులకు టికెట్లు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. ఇందులో దక్షిణాది, ఉత్తరాది అనే తేడా లేదు. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎక్కడా కాంగ్రెస్ గెలిచే అవకాశం లేదు. అస్సాం, బెంగాల్‌లో భాజపా, తమిళనాడులో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తాయి. కేరళలోనూ మాకు మంచి ఫలితాలు వస్తాయి' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

**గన్‌పార్కులో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన**

నిజంగా రూ.వేల కోట్ల అవినీతి చేయకపోతే ఎందుకు సభను వాయిదా వేసుకున్నారు? ముఖ్యంగా మెట్రోపై చేసిన ప్రకటన తప్పుల తడకగా ఉంది. 280 ఎకరాలు ఎల్అండ్‌టీకి లీజుకిచ్చాం. ఆ భూమిని కొట్టేయడానికి కుట్రలు చేస్తున్నారు.





-2లో

# సీఐడీ వద్దంటే సీబీఐ

హైదరాబాద్: ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని హరీశ్‌రావు బంధువులు భూదోపిడీ సాగించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ అక్రమాలపై సభాసంఘం వేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శాసనసభలో ఆదివారం పలు బిల్లులపై చర్చ సందర్భంగా భారాస సభ్యులు అడ్డు తగులుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ మైనింగ్ అక్రమాలపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో సీఎం స్పందించారు. అంతకుముందు భాజపా సభ్యుడు వెంకటరమణారెడ్డి ప్రసంగిస్తూ భారాస సభ్యులు అడిగిన విధంగా సభాసంఘం వేయాలని సూచించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "భాజపా నాయకులకు సూచనలు ఇవ్వడం.. తర్వాత పారిపోవడం అలవాటుగా మారింది. కామారెడ్డి ఎమ్మెల్యేకు సూచన చేస్తున్నా. కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఏటీఎంలా మార్చుకుందని.. వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని ప్రధాని మోదీ అన్నారు. మేం కాళేశ్వరంపై కమిషన్ వేస్తే కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌ను జైల్లో పెట్టడం మీతో కాదు' అని విమర్శించారు. మేం కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లోగా అరెస్ట్ చేస్తామని కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి అంటే నమ్మి కేసును సీబీఐకి అప్పగించాం. 48 గంటలు కాదు.. ఇప్పటికి ఎన్ని నెలలైందో మీరే చూశారు. భాజపా, భారాస ఒక్కటైపోయి విచారణను దిల్లీలో తొక్కిపెట్టాయి. ఈ విషయం కిషన్‌రెడ్డిని అడిగే ధైర్యం లేదా..? మొన్నటి పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికల్లో భారాస, భాజపా ఓట్లు, సీట్లు పంచుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌ను, హరీశ్‌రావును జైల్లో పెట్టిన తర్వాత భాజపా నేతలు సూచనలు చేస్తే స్వీకరిస్తాం. సభలో నిన్న జరిగిన చర్చలో పూర్తిస్థాయిలో అందరికీ అవకాశమిచ్చాం. చర్చ తర్వాతే 2014 జూన్ 2 నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై వచ్చిన ఆరోపణలపై సీఐడీతో విచారణ జరిపిస్తామని సభలోనే ప్రకటించాం. సీఐడీపై మీకు నమ్మకం లేదా..? తెలంగాణ పోలీసుల మీద నమ్మకం లేదా..? భారాసకు రాజకీయం కావాలి. ఈరోజు హరీశ్, కేటీఆర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. మైనింగ్ అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించిన తర్వాత సభ బయటికి వెళ్లాక హరీశ్‌రావుపై కేటీఆర్ మండిపడ్డారు. సీఐడీ విచారణ తన మెడకు చుట్టుకోబోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బ్లాక్‌మెయిల్ చేయబోయి నన్ను ఇరికించారని సంతోష్‌రావు సైతం మండిపడ్డారు..' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.



**హరీశ్‌రావుకు ధైర్యముంటే సభాసంఘానికి అంగీకరించాలి..**

"హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో ధరణిని అడ్డంపెట్టి అక్రమంగా భూబదలాయింపునకు పాల్పడ్డారు. దానిపై మంత్రి శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌ను నివేదిక అడిగారు. అందులో మా తమ్ముడు స్వయంగా ఉన్నారని.. సహకరించాలని మంత్రికి ఎన్నోసార్లు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. అయితే సీఎం ఆదేశించారని.. నివేదిక తెప్పిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అప్పటి నుంచి మంత్రిని లక్ష్యంగా చేసుకున్నారు. నేను నిర్దిష్టమైన ఆరోపణ చేస్తున్నా. హరీశ్‌రావు సోదరుడు మహేశ్‌రావు, మామ హన్మంతరావు, బావమరిది సుమన్‌రావు వందల ఎకరాల భూమిని పరిశ్రమ యజమానుల్ని బెదిరించి సేల్‌డీడ్ లేకుండా, కొనుగోలు లేకుండా బదలాయించుకున్నారు. దానిపై సభాసంఘం వేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. హరీశ్‌రావుకు ధైర్యం, నిజాయతీ ఉంటే.. ఆయన నిజాయతీపరుడని కేటీఆర్, వెంటరమణారెడ్డి నమ్మితే ఈ ముగ్గురూ సభాసంఘం వేసేందుకు ఒప్పుకోవాలి. తక్షణమే సభాసంఘం ప్రకటిస్తా..' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి




హైదరాబాద్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమ మైనింగ్ చేస్తున్నారని.. ఆయనను తక్షణమే బర్తరఫ్ చేసి.. దీనిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆదివారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ.. 'మంత్రి పొంగులేటి కుటుంబం చేస్తున్న కుంభకోణం బయటపెట్టేసరికి ప్రభుత్వం బిత్తరపోయింది. అందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికీ వాటా ఉందా? అందుకే చర్యలు తీసుకోవడం లేదా? అక్రమంగా మైనింగ్ జరిగింది వాస్తవమని ముఖ్యమంత్రి స్వయంగా అంగీకరించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటి దూరపు బంధువులది అంటున్నారు. 2020-22 వరకు పొంగులేటి ఛైర్మన్‌గా ఉన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ముఖ్యమంత్రి.. పొంగులేటి కంపెనీకి ఇచ్చారు. రెండున్నరేళ్లుగా ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనీ చేయలేదు. కోకాపేటలో ఉన్న భాగ్యలక్ష్మి మైనింగ్ ముఖ్యమంత్రి బంధువులది. మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి రూ.1800 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా.. రూ.900 కోట్లు వస్తోంది. మరి మిగతాది ఎవరి జేబుల్లోకి వెళుతోందో ముఖ్యమంత్రి జవాబు చెప్పాలి. నిజంగా రూ.వేల కోట్ల అవినీతి చేయకపోతే ఎందుకు సభను వాయిదా వేసుకున్నారు? ముఖ్యంగా మెట్రోపై చేసిన ప్రకటన తప్పుల తడకగా ఉంది. 280 ఎకరాలు ఎల్‌అండ్‌టీకి లీజుకిచ్చాం. ఆ భూమిని కొట్టేయడానికి కుట్రలు చేస్తున్నారు. రాయదుర్గం వద్ద మెట్రోకు కేంద్రం ఎందుకు అభ్యంతరం చెబుతోంది. ఎల్‌అండ్‌టీ సీఎఫ్‌ఓను జైలులో వేస్తామని బెదిరించారు. ఇదో పెద్ద కుంభకోణం' అని ఆరోపించారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కోవ లక్ష్మి, వివేకానంద్‌గౌడ్, గంగుల కమలాకర్, కాలేరు వెంకటేశ్, సునీతాలక్ష్మారెడ్డి, తదితరులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. పాదయాత్రగా అసెంబ్లీకంది బయలుదేరి వెళ్లారు.

# సీఐడీతో కాదు.. సిటింగ్ జడ్జితో విచారణ జరిపిద్దాం

**దళితులపై రేవంత్‌ది కపట ప్రేమ**

**దళితులపై రేవంత్‌రెడ్డిది కపట ప్రేమ. కానీ కేసీఆర్.. వారికోసం 'దళిత బంధు' తెచ్చారు. భారాస ప్రభుత్వ హయాంలో 2023-24లో దళిత బిడ్డల కోసం రూ.14,648 కోట్లు ఖర్చుచేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కోత పెట్టింది. సామాజిక భద్రతలోనూ మాప్రభుత్వం ఖర్చుచేసిన నిధుల కంటే రూ.145 కోట్లు తక్కువ ఖర్చుచేసింది. ఈ ప్రభుత్వం ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ కింద రూ.33,124 కోట్లు కేటాయించి.. ఖర్చుచేసింది మాత్రం రూ.14,148 కోట్లు మాత్రమే. దళితబంధు కోసం 2024-25లో రూ.2 వేల కోట్లు పెట్టి.. రూపాయి కూడా ఖర్చుచేయలేదు" అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.**



హైదరాబాద్: భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం హరీశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైంది. దీంతో సీఎం దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. అక్రమ మైనింగ్‌పై హౌస్‌కమిటీ వేయాలని మేము డిమాండ్ చేస్తే.. మాకు మైక్ ఇవ్వకుండా దళితుల అంశాన్ని రాజకీయం చేయాలని చూశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 20 కుంభకోణాలు జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈరోజు లేఖ రాశాం. వీటిపై విచారణ చేపట్టండి. రాష్ట్రంలో భూముల లావాదేవీల్లో ముఖ్యమంత్రికి, పొంగులేటికి మధ్య ఫెవికాల్ బంధముంది. కొడంగల్, నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్ పొంగులేటి కంపెనీకే ఇచ్చారు. మూసీ సుందరీకరణ టెండర్ కూడా వారికే ఇస్తున్నారు. అందుకే పొంగులేటిపై హౌస్‌కమిటీ వేసే ధైర్యం సీఎంకు లేదు. వీరు చేస్తున్న భూకుంభకోణాలను త్వరలో ఆధారాలతో సహా బయటపెడతా. మంత్రిని కాపాడే ప్రయత్నంలో మరిన్ని అబద్ధాలు

మంత్రి తప్పు చేస్తే సీఐడీ విచారణ న్యాయంగా జరుగుతుందా? అందుకే పొంగులేటిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అయితే ఆయన్ను కాపాడటంలో భాగంగా సీఐడీ విచారణ వేశారు. పార్లమెంట్‌లో జాయింట్ హౌస్‌కమిటీ వేయాలని అనేకసార్లు రాహుల్‌గాంధీ మాట్లాడారు. ఆయన కోరితే తప్పులేదు కానీ.. మేము డిమాండ్ చేస్తే తప్పా? గతంలో ఓబుళాపురం మైనింగ్‌పై హౌస్‌కమిటీ వేశారు కదా? మరిప్పుడు మంత్రి అక్రమ మైనింగ్‌పై హౌస్‌కమిటీ వేస్తే తప్పేంటి? పైగా 'అక్రమ మైనింగ్' అని గనుల శాఖే రెండుసార్లు జరిమానా విధించింది.. దాన్ని చెల్లించారా? లేదా? ఆధారాలు చూపండి.... ఎందుకు ఆ సంస్థపై చర్యలు తీసుకోలేదు? మంత్రిని కాపాడే ప్రయత్నంలో ప్రభుత్వం మరో 100 అబద్ధాలను బయటపెట్టుకుంది. మీటర్లు దొరకడం లేదని.. డీజిల్ జనరేటర్లు ఇచ్చామని గనులశాఖ మంత్రి అంటున్నారు. సీఎస్ఓ, సీఎఫ్ఓ దాఖలు చేసిన వారికి మీటర్ల అనుమతి ఇచ్చినప్పుడు.. మంత్రి కంపెనీకి డీజిల్ జనరేటర్లు ఎలా ఇచ్చారు? దీన్నిబట్టి సీఎస్ఓ, సీఎఫ్ఓ దాఖలు చేయలేదని అర్థమవుతోంది. అక్రమ మైనింగ్ వల్ల రూ.వందల కోట్లు రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. నా సొంత ప్రయోజనాల కోసం ఏనాడూ మంత్రి పొంగులేటికి నేను ఫోన్ చేయలేదు. ప్రభుత్వ అవినీతిని మా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి గట్టిగా ప్రశ్నిస్తున్నారు కాబట్టే.. ఆయనపై ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేశారు.

నిజానికి ముఖ్యమంత్రి మాట్లాడుతున్న భాషపై ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలి.

# ఎథిక్స్ కమిటీకి కౌశిక్‌రెడ్డి వ్యవహారం

హైదరాబాద్: శాసనసభలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారం ఆదివారం దుమారం రేపింది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి బెదిరింపు ధోరణిలో సంజ్ఞలు చేశారని.. ఈ ఘటనపై విచారణకు నైతిక విలువల (ఎథిక్స్) కమిటీకి సిఫార్సు చేస్తూ శాసనసభ తీర్మానం చేసింది. అంతకుముందు కౌశిక్‌రెడ్డిపై సుమోటోగా విచారణ జరపాలని, ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పీకర్‌ను కోరారు. సభ ప్రారంభమైన వెంటనే తొలుత నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్ మృతికి సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సంతాప ప్రతిపాదనను సభ ముందుంచారు. అనంతరం పలు బిల్లులను మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే భారాస సభ్యులు మైనింగ్‌పై సభాసంఘం వేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ బాలానగర్‌లో భూఆక్రమణలపై సభాసంఘం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా స్పీకర్ సభలో మాట్లాడేందుకు సభ్యులకు అవకాశం ఇచ్చారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ తన కుటుంబానికి చెందిన భూముల్ని సైతం బెదిరించి లాక్కున్నారని.. అప్పట్లో ఏం చేయలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ధరణి అక్రమాలపై విచారణ జరిపించాలన్న కడియం..అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ..ద

ధరణి అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మీరు పార్టీ ఫిరాయించారని, ఏ పార్టీలో ఉన్నారని భారాస సభ్యులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఆ సమయంలో కౌశిక్‌రెడ్డి.. కడియంను ఉద్దేశించి బెదిరింపు ధోరణిలో సంజ్ఞలు చేశారని.. ఆయన హావభావాలు, వ్యవహారశైలి సరిగా లేదంటూ మంత్రులు మండిపడ్డారు. దళిత నేతను అవమానించిన సభ్యుడిని సస్పెండ్ చేయాలంటూ మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, వివేక్, అజారుద్దీన్‌తోపాటు పలువురు కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై వీడియోలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యవహారంపై మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి గన్‌తో కాలుస్తానన్నట్లుగా.. చేతితో సైగ చేశారని, ఆయన అనుచిత ప్రవర్తనను సుమోటోగా విచారణకు స్వీకరించి, ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని, కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఎథిక్స్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం ప్రసంగం అనంతరం శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు దీనిపై తీర్మానం ప్రవేశపెట్టగా.. సభ్యుల అభిప్రాయాల మేరకు ఆమోదం పొందినట్లు సభాపతి ప్రకటించారు.

# అమెరికా అవాక్స్ ధ్వంసం



దుబాయ్: పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ శుక్రవారం జరిపిన దాడిలో అగ్రరాజ్యానికి చెందిన అత్యాధునిక నిఘా విమానం 'బోయింగ్ ఈ-3 సెంట్రీ' తీవ్రంగా ధ్వంసమైంది. అమెరికా, దాని మిత్రదేశాల బలగాలకు కళ్లు, చెవుల్లా ఈ 'ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్(అవాక్స్)' విమానం పనిచేసేది. ఇందులోని అత్యాధునిక రాడార్ వ్యవస్థ.. విమానాలు, క్షిపణుల కదలికలను వందల కిలోమీటర్ల దూరం నుంచే పసిగట్టేది. దీన్ని కోల్పోవడం వాషింగ్టన్‌కు మింగుడుపడని విషయమే. మరోవైపు- భూతల పోరుకు అమెరికా సిద్ధమవుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నవేళ యుద్ధాగ్ని మరింత ఉద్ధృతంగా విస్తరిస్తోంది! ఇరాన్‌లోని పలు విశ్వవిద్యాలయాలపై ఇజ్రాయెల్ ఆదివారం వైమానిక దాడులతో విరుచుకుపడింది. ప్రతీకారంగా ఇజ్రాయెల్ యూనివర్సిటీలతో పాటు పశ్చిమాసియావ్యాప్తంగా అమెరికా విశ్వవిద్యాలయాల శాఖలపై దాడులు చేస్తామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) హెచ్చరించింది. శాంతిచర్చలు జరుపుతామని చెబుతూనే పశ్చిమాసియాలో అదనపు బలగాల మోహరింపు వేగాన్ని వాషింగ్టన్ పెంచుతోంది. 3,500 మంది మెరైన్లతో దాని అధునాతన ఉభయచర యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి ఆ ప్రాంతానికి చేరుకుంది. అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ హెచ్.డబ్ల్యు.బుష్ కూడా పశ్చిమాసియా దిశగా ప్రయాణిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ వాషింగ్టన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. ఇరాన్ గడ్డపై అడుగుపెట్టే అమెరికా సైనికులను బుగ్గి చేసేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. యుద్ధం నిలిపివేత ప్రయత్నాల్లో భాగంగా సౌదీ అరేబియా, తుర్కియే, ఈజిప్టు విదేశాంగ మంత్రులు పాకిస్థాన్‌లో ఆదివారం చర్చలు జరిపారు. గగనతలంలో కమాండ్ సెంటర్ ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ చేసిన దాడిలో పలు ఇతర విమానాలూ ధ్వంసమయ్యాయి. అయితే మిగతావాటితో పోలిస్తే 'ఈ-3 సెంట్రీ'ని కోల్పోవడం అమెరికాకు అత్యంత నష్టదాయక పరిణామం. ఇది సాధారణ విమానం కాదు. బోయింగ్-707 మోడల్‌లో మార్పులు చేసి.. గగనతలంలో విహరించే కమాండ్ సెంటర్‌లా దీన్ని రూపొందించారు. ఇది శత్రుదేశాల డ్రోన్లు, క్షిపణులు, యుద్ధవిమానాలు, ట్యాంకర్ విమానాల కదలికలను నిశితంగా గమనిస్తుంది. గగనతలంలో 250 మైళ్ల పరిధిలో ఏం జరిగినా గుర్తించగలదు. ఇప్పుడు కోల్పోయినదాని స్థానాన్ని భర్తీ చేయాలంటే 70 కోట్ల డాలర్లు(దాదాపు రూ.6 వేల కోట్లు) ఖర్చవుతాయని అంచనా. ప్రస్తుతం అమెరికా వద్ద 'ఈ-3 సెంట్రీ'లు 16 మాత్రమే పనిచేసే స్థితిలో ఉన్నాయి.

అవాక్స్ విమానంరష్యాయే ఉపగ్రహ చిత్రాలు అందించింది: జెలెన్‌స్కీ

ప్రిన్స్ సుల్తాన్ స్థావరం ఉపగ్రహ చిత్రాలను ఇరాన్‌కు రష్యాయే అందించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునేలా టెహ్రాన్‌కు మాస్కో నిఘా సహాయం అందిస్తోందని ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో పేర్కొన్నారు.

వెనక్కి తగ్గని టెహ్రాన్ ఇజ్రాయెల్‌పై భీకర దాడులను ఇరాన్ ఆదివారం కొనసాగించింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని బీర్షెబా ప్రాంతంలో ఉన్న నియోట్ హవావ్ పారిశ్రామిక జోన్‌లో టెహ్రాన్ క్షిపణి దాడులతో భారీగా మంటలు చెలరేగాయి. దాదాపు 8 మంది గాయపడ్డారు. అక్కడ అధిక మొత్తంలో ప్రమాదకర రసాయనాలు నిల్వ ఉండటంతో.. సమీప ప్రాంతాల నుంచి ప్రజలను అధికారులు ఖాళీ చేయించారు. విషవాయువులేమైనా లీకయ్యాయో గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

జోర్డాన్‌లో అమెరికా బలగాలున్న మువాఫాక్ సల్తీ వైమానిక స్థావరంపై డ్రోన్లతో టెహ్రాన్ దాడి చేసింది. ఇరాన్‌పై దాడులకు ఈ స్థావరాన్ని వాషింగ్టన్ ఎక్కువగా వినియోగించుకుంటున్న సంగతి గమనార్హం. ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ అధ్యక్షుడు నెచిర్వాన్ బార్జానీ నివాసం లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో బార్జానీ సురక్షితంగా బయటపడ్డారు. ఇరాన్‌కు మద్దతిచ్చే పౌరసైన్యాలే ఈ దాడికి పాల్పడ్డాయని అమెరికా ఆరోపించింది. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఈ హత్యాయత్నం చేశాయని టెహ్రాన్ ప్రత్యారోపణ చేసింది.

విశ్వవిద్యాలయాలపై టెల్‌అవీవ్ దాడులు

ఇరాన్‌లోని పలు విశ్వవిద్యాలయాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. అణు పరిశోధనల కోసం టెహ్రాన్ ఉపయోగించిన విద్యాసంస్థలూ వాటిలో ఉన్నట్లు తెలిపింది. ఈ దాడులపై ఐఆర్‌జీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రతీకారంగా ఇజ్రాయెల్ యూనివర్సిటీలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. తమ విశ్వవిద్యాలయాలపై టెల్‌అవీవ్ దాడులను సోమవారం మధ్యాహ్నంకల్లా వాషింగ్టన్ ఖండిస్తే.. పశ్చిమాసియాలో అమెరికా యూనివర్సిటీల శాఖలను లక్ష్యంగా చేసుకోబోమని తెలిపింది. మరోవైపు- లెబనాన్‌పై దాడులను మరింత విస్తరిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు ప్రకటించారు.

3,500 మంది మెరైన్లతో..

అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియా చేరుకుంది. ఇది ఈ నెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా అనేక యుద్ధవిమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డీగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

'మేం సిద్ధంగా ఉన్నాం'

పశ్చిమాసియాలో బలగాల మోహరింపు పెంచుతున్న అమెరికాకు ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ గట్టి హెచ్చరికలు జారీచేశారు. శాంతిచర్చలకు సిద్ధమని బయటకు చెప్తూ.. భూతల దాడులకు సిద్ధమవుతుండటమేంటని ప్రశ్నించారు. అమెరికా సైనికుల రాకకోసం తాము ఎదురుచూస్తున్నామన్నారు. ఇరాన్ గడ్డపై అడుగుపెట్టగానే వారిని అగ్నికి ఆహుతి చేస్తామని పేర్కొన్నారు. వాషింగ్టన్‌కు సహకరించే, దాని ప్రాంతీయ మిత్రదేశాలనూ తీవ్రస్థాయిలో దండిస్తామని హెచ్చరించారు.

ఇస్లామాబాద్‌లో చర్చలు

పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ ఆహ్వానం మేరకు.. ఈజిప్టు విదేశాంగ మంత్రి బదర్ అబ్దెలట్టి, తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్, సౌదీ విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ ఆదివారం ఇస్లామాబాద్ చేరుకున్నారు. పశ్చిమాసియాలో పరిణామాలపై చర్చించారు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష శాంతిచర్చలు జరిగేలా చూడటంపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్‌లో ప్రయాణానికి కొన్ని నౌకలను ఇరాన్ అనుమతిస్తుండటం శుభపరిణామమని చర్చల సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో తాను మాట్లాడినట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు.

# కాకతీయ విద్యార్థుల..
# “రోబోటిక్స్ పద్రర్శనలు అదుర్స్”.

➢అంతర్జాతీయ స్థాయి విద్య తమ లక్ష్యం.

➢కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల డైరెక్టర్ రామోజీరావు.

➢పాల్గొన్న పాఠశాల డైరెక్టర్ రజినీకాంత్.






















**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

జిల్లా కేంద్రంలో గల ప్రముఖ కాకతీయ విద్యా సంస్థ విద్యార్థులు గత రెండు రోజులుగా నిర్వహించిన “రోబోటిక్స్ పద్రర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.నగరంలోని శ్రీరామా గార్డెన్స్ లో గత 2 రోజులుగా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించగా, ఈ వేడుక ఆదివారంతో ముగిశాయి. రెండవరోజైన ఆదివారం సెలవుదినం కావడంతో తల్లిదండ్రులు, విజిటర్స్ యొక్క తాకిడి శనివారం కంటే ఎక్కువైంది. పద్రర్శనలను వీక్షించిన పజ్రలు, తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తంచేస్తూ, ఇంత మంచి ప్రోగ్రాంను నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ రోబో ఫెస్ట్ విద్యా ర్థులు మరింత ఉత్సా హంతో పాల్గొని ప్రాజెక్టుల గురించి విజిటర్స్ కు వివరించారు. ఈ పోటీలో చక్కని ప్రతిభ, నైపుణ్యాన్ని పద్రర్శించిన విద్యార్థులకు బహుమతులు, వ్యక్తిగత మెడల్స్ ను అందించిన యాజమాన్యం, మున్ముందు నిజామాబాద్ లో అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ విద్యను అందించడమే తమ లక్ష్యమని ఇలాంటి రోబో ఫెస్ట్ లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు.

**పాఠశాల డైరెక్టర్ రామోజీరావు మాట్లాడుతూ,**

దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి అతి పెద్ద రోబో ఫెస్ట్ ను నిర్వహించడం మాకెంతో గర్వకారణమని, ఇందుకోసం రోబోటిక్ స్టాఫ్, టీచింగ్-నాన్ టీచింగ్ స్టాఫ్, ఇతర స్టాఫ్ అందరి కృషి మరువలేనిదని వారిని అభినందించారు. పాఠశాల స్థాయి నుండే రోబోటిక్స్ కాన్సెప్ట్ మీద అవగాహన పెంచుకోవాల్సిన అవసరం నేటి పోటీ పప్రంచంలో ఉందని, భవిష్యత్ అంతా ఇలాంటి టెక్నా లజీ మీదనే నడుస్తుందనే విషయాన్ని పజ్రలందరూ గ్రహించి, తమ పిల్లలకు అత్యున్నత విద్యను అందించాలని అన్నారు. ఐఐటి ఫౌండేషన్ అండ్ ఆల్ రౌండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా ఈ రోబోట్ ఫెస్ట్ ను నిర్వహించామని డైరెక్టర్ రజినీకాంత్ తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రజినీకాంత్, రాజా, రామోజీరావు, తేజస్విని, ప్రిన్సి పాల్ లు చంద్రశేఖర్, రవికాంత్, సుచరిత, వైస్ ప్రిన్సి పాల్ లు భావనా, భూపాల్, రోబోటిక్స్ హెడ్ నిరేష్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యా ర్థులు పాల్గొన్నారు.







# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

**ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక**



హైదరాబాద్: బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు.

ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి.

అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

**2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు**



లాస్‌ఏంజిల్స్: ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?



పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ. 93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

వాషింగ్టన్: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి
విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చుని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.
జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

**నియామకాల్లో తీరని జాప్యం**

**ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి**

**అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్**

హైదరాబాద్: పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷-లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

**వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు**

భద్రాచలం: భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# మంటలు చెలరేగి కారు దగ్ధం

యాదాద్రి భువనగిరి: బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్‌లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పేస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

# వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

**ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన**

హైదరాబాద్: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది.తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు.

# అత్యవసరంగా ల్యాండ్ అయిన ఇండిగో



న్యూఢిల్లీ: విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రన్‌వే 28 వద్ద అధికారులు పూర్తిస్థాయి ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. మొత్తం 160 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఉదయం 10:59 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో అందరూద
ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ వర్గాలు తెలిపాయి.